# సినీ బేతాళ కథలు

– డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 15 -

## గంటారావం

**విక్రమార్కుడు మళ్ళీ** బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు. ‘ఓ విసుగు చెందని విక్రమార్కా! నీకు శ్రమ కలుగకుండా వుండేందుకు మరోకథ చెబుతాను విను!‘ - అని బేతాళుడు ప్రారంభించాడు.

‘ఆ మధ్య త.చూ.రావు అనే నిర్మాత తరచూ చిత్రాలు తీసేవాడు. అతని పూర్తిపేరు తనకాల చూడామణిరావు, కానీ అంతా అతడిని త.చూ.రావనే పిలిచేవారు. తన చిత్రంలో పనిచేసిన నటీనటులకు ముందుగా కాస్త అడ్వాన్స్ యిచ్చి, సినిమా షూటింగ్ చివర్లో డబ్బు అడిగితే తర్వాత చూసుకుందాం అని ఎగ్గొట్టేవాడు. అంచేత తనకాల చూడామణిరావు పేరు తర్వాత చూసుకుందాం రావు అయి త.చూ.రావు అయి ఫిక్సయిపోయింది. తను యీమధ్యనే ‘ఏవీరాలవు‘ అనే సినిమా తీశాడు. వీడి దగ్గర్నుంచి ఏవీరాలవు అనుకుంటూనే తెరదురద వల్ల నటీనటులంతా నటించి, త.చూ.రావు యిచ్చిన అడ్వాన్స్‌తో సరిపెట్టుకున్నారు. కానీ ‘ఏవీరాలవు‘ చిత్రంలో తొలిసారి వొక చిన్న వేషం వేసిన శ్రీమన్నారాయణ మాత్రం సరిపెట్టుకోలేదు. అంచేత త.చూ.రావుని సినిమా పూర్తయాక తనకు రావల్సిన కాస్త డబ్బు యిమ్మని అడిగాడు - ‘అయ్యా! నిర్మాతగారూ! నాది పెద్ద సంసారం. వేసింది చిన్న వేషం అయినా మీరిచ్చిందాంతో నా తదుపరి చిత్రం దాకా యిల్లు గడిపేస్తాను. దయచేసి నాకు రావల్సింది నాకు పడెయ్యండి‘ అని అర్థించాడు.

అందుకు బదులుగా త.చూ.రావు అలవాటు ప్రకారం తర్వాత చూద్దాం అనలేదు. ‘సూడు సీమన్‌రాయనా! ఆర్టిస్టోల్లకి డబ్బిస్తే నే అడుక్కు తినాల. అసలే నా సినేమాలన్నీ ప్లాపులు. నీలాంటి సిన్నేసాలోల్లకి కూడా కర్సెడితే నాను సినేమాలు మానేసి సిన గంజారంలో సిల్లిగార్ల బిగినెస్సెట్టుకోవాల.‘ అన్నాడు.

‘అలాక్కాదు సార్! పెద్ద మొత్తవేం కాదు. కేవలం చిల్లర. మీరు గొప్ప నిర్మాతలు. కాదనకండి‘ అని వేడుకున్నాడు శ్రీమన్నారాయణ.

‘నాను కలక్‌సన్లు తప్ప, కదెప్పుడూ పాలో అవనుకదా! ఇంతకీ నువ్వేసిన యేసం ఏటో సెప్పు?‘ అనడిగాడు త.చూ.రావు.

శ్రీమన్నారాయణ తను చేసిన సీను చెప్పాడు. 'నేను చేసింది - దేవాలయం సీను సార్. నాది పూజారి వేషం. దైవానుగ్రహం వల్ల నాకో భక్తురాలితో లింకు లంకైందండి. ఒకరోజు రాత్రి అనుగ్రహం అనుగ్రహించిందండి. ఆ రాత్రి సదరు భక్తురాలు, నేను గుడి వెనక ఒక అరగంటసేపు మన్మధానుగ్రహం పొందావండి. కానీ దైవాపచారమో! నా గ్రహచారమో తెలియదండి. మర్నాడు గుడిగంట మిస్సయిందండి. దాంతో ఎంక్వయిరీ పెట్టారండి. దేవాలయం ధర్మకర్తగారు వూరి ప్రజలముందు నన్ను నిలదీసి అడిగారండి. 'ఏవయ్యా పూజారీ, గంట తీసుకున్నావా? ' - అని. నేను కన్ఫ్యూజయిపోయి, రాత్రి గుడివెనక భాగోతం పసిగట్టేశారనుకుని, - భక్తురాలితో గడిపిన టైము లెక్కేసుకుని - 'అయ్యా! నేను గంట తీసుకోలేదు. అరగంటే తీసుకున్నాను.' అని చెప్పానండి. కంచు గంటలో అరగంట తీసుకోవడం ఏవిటో అర్ధంగాక ఆలయ ధర్మకర్తగారు కేసు కొట్టేసి, కొత్త గంట పురమాయించి పూజారికి అంటే పూజారి వేషం వేసిన నాకు వార్నింగిచ్చి వెళ్ళిపోయారండి.- అదండి సీను. రెండ్రోజులు షూట్ చేశారండి. తవరెంతో కొంతిప్పించాలండి. నా వేషం ఎలాంటిదయినా నేను భగవంతుణ్ని నమ్ముకున్నానండి. నాకిప్పుడు మీరే భగవంతుడు త.చూ.రావుగారూ!' అని మళ్ళీవేడుకున్నాడు. 'అంతేకాదండి! నేను పాత్రలో జీవించడం వల్ల మన సినిమాలో భక్తురాలు వేషం వేసిన పిల్లతో సెకండ్ సెటప్ అంకురించి ఆర్ధికంగా అవస్థపడుతున్నానండి' - అని యింకా వేడుకున్నాడు నటుడు శ్రీమన్నారాయణ.

- అదీ విక్రమార్కా! విషయం. ఇంతకీ ఆ తర్వాత చూద్దాం అనే త.చూ.రావు, మన శ్రీమన్నారాయణుడి కష్టం తీర్చాడా? లేదా?' - ఈ నా ప్రశ్నకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో, నీ తల ఆ గుళ్ళో గంటలా మాయమయిపోతుంది. అప్పుడు నీకు నీ తలతో బాటు బ్రెయిను కూడా మిస్సయి నువ్వు తెలుగు సినిమాలకు (త.చూ.రావులాంటి నిర్మాతలకు) కథలు రాసుకోవాల్సొస్తుంది." అని ముగించాడు బేతాళుడు.

అందుకు విక్రమార్కుడు, '- ఓ! బేతాళా! కథలో సీను విన్న త.చూ.రావుకి వెంటనే మనసు నిర్మాత డబ్బులా కరిగిపోయింది. అర్జంటుగా తన జేబులో వున్న ఒక్క లక్ష తీసి శ్రీమన్నారాయణుడికిచ్చి తన సినిమాకి కాస్ట్ పెరిగిపోయింది మొర్రో! అని అరగంటసేపు అంగ ప్రదక్షిణాలు చేశాడు.

ప్రాణులందరికీ ప్రభువు, ప్రాణమూ పుండరీకాక్షుడే 'అహమాత్మాగుడాకేశ! సర్వభూతాశయస్థితః! అహమాదిశ్చ మధ్యంచ భూతానామంత ఏవచ' - అన్నారోయ్ గీతాచార్యులు, శ్రీకృష్ణభగవానుడు' అని రిప్లీకరించగానే బేతాళుడు చెట్టుమీద తనకో సెకండ్ సెటప్ వుందని భ్రమించేలా అర్జంటుగా ఎగిరి చెట్టెక్కేసాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments